# ఆవరణ

కన్నడ మూలం

**ఎస్.ఎల్. భైరప్ప**

తెలుగు అనువాదం

**అరిపిరాల సువర్ణ**

ఎమెస్కో

# అధ్యాయం – 1

తుంగభద్రానది ఆనకట్టపై ప్రభుత్వ అతిథిగృహం పై అంతస్తులోని ఓ గది కిటికీలోంచి బయటకు చూస్తున్న రజియా తల వెంట్రుకలు గాలికి ఎగురుతున్నాయి. పొద్దుటినుంచీ ముళ్లకంపలలో తిరిగిన అలసట, చల్లటి గాలికి సేదతీరటంవల్ల తగ్గుతున్నది...

"టీ చెప్పనా?" అమీర్ అడగడం రజియాకు వినపడలేదు.

విశాలమైన జలాశయం నుంచి వీచే చల్లటిగాలి వల్లా, ఆమె అన్యాలోచనల వల్లా అనేది అతనికి అర్థం కాలేదు... ఎంతైనా ఆలోచించే స్త్రీ. ఉన్నదో చోట... మనసెక్కడో దూరంగా అని తెలుసతనికి... అయినా తనకి మాట్లాడాలని ఉత్సాహంగా వుంది, మౌనంగా వుండడం అసాధ్యంగా వుంది, ఆమెను ఆలోచించుకోనీ అనుకోవడానికి... గాలికి పైకి లేచి విశాలంగా ప్రవహించే నీరు... అతనిలోనూ ఉత్సాహం వచ్చింది...

''సాయంత్రం ఎండకు జుట్టు చామరంలా మెరుస్తూంది. కాస్తంత డై చేసుకుంటే ఇంకా అందంగా మెరుస్తూ కనపడుతుంది.'' రొమాంటిక్ భావంతో అన్నా ఆమె ఇటు తిరగలేదు, మాట్లాడలేదు.

ఈ మాట నేనివ్వాళ కొత్తగా అనడం లేదు... ఇది వరకూ ఎన్నోసార్లు అన్నాను. ఓ సారి మాత్రం "నేను నల్ల డై వేసుకోవడానికి తయారు... అయితే నువ్వు నీ తెల్ల గడ్డానికి డై చేసుకోవాలి. వేసుకుంటావా...?" అన్నావు. పొడుగాటి మౌలానా గడ్డం అయితే డై వేసుకోవచ్చు. కానీ నాది మార్క్సిస్ బుద్ధిజీవి గడ్డం. ప్రతిరోజూ ట్రిమ్ చేసుకుంటాను. డై వేసుకున్నది కాస్తా కత్తెర పడుతుంది. ప్రతీ దినం డై వేస్తే చర్మం కమిలిపోతుంది... అదీ కాక తెల్ల జుట్టు ముసలితనానికి గుర్తు... ఆడవారి విషయం అలా కాదు.. అలా అంటే ఆమె ఒప్పుకోదు అన్న విషయం గుర్తుకొచ్చి మౌనంగా వుండిపోయాను.

టీ, బిస్కెట్లు తీసుకొచ్చిన వెయిటర్ 'రాత్రి భోజనానికి ఏం చెయ్యా'లని అడిగినా ఆమె జవాబు చెప్పలేదు. హోటలుకు వెళ్లినప్పుడల్లా భోజనానికి ఆర్డరు ఇచ్చేది ఆమే.

ఇప్పుడు "మీకు ఇష్టమైంది చెప్పండి" అని లేచి వచ్చి, టీ కప్పు చేతిలోకి తీసుకుని మళ్లీ కిటికీ దగ్గర కెళ్లింది.

అమీరే "వీలైతే దొరికితే చికెన్ పులావ్ లేకపోతే బిరియానీ" అన్నాడు.

"ఏవీ లేవు సార్! ఇవ్వాళ వేరే గెస్టులెవరూ లేరు. ఉత్త వెజిటేరియన్ చేసి ఇస్తాను. చపాతీ, ఆలుగడ్డ కూర, అన్నం, సాంబారు, పెరుగు..." అని వెయిటరు చెప్పినప్పుడు అమీరుకు కోపం వచ్చింది...

"ఏమిటయ్యా ఇది? ఇవ్వాళ పొద్దుటి నుంచీ వుత్త వెజిటేరియన్ భోజనం తింటున్నాము. ఒక్క పూటయినా నాన్‌వెజ్ తినకపోతే ఒంట్లో శక్తి ఎలా వస్తుంది...? మీ హోటల్లో భోజనవసతి బాగుండలేదని కంప్లైంట్ ఇయ్యనా...? మేము ప్రభుత్వ అతిథులం" అన్నదానికి వెయిటరు నిస్సహాయంగా నవ్వుతూ నిల్చున్నాడు.

ప్రభుత్వ అతిథిగృహాలలోని స్థితిగతులు అమీరుకు తెలియనివి కావు... మరీ గట్టిగా అంటే ఇంకా అలక్ష్యం చేస్తారని బిగువు కాస్త సడలించుకుని, "సరేలే! ఇప్పుడు ఏం వుంటే అదే చెయ్యి. పొద్దున బ్రేక్‌ఫాస్ట్‌కు ఆమ్లెట్ కావాలి.." అన్నాడు. "అలాగేనండీ సారూ... ఇప్పుడే హొస్పేట నుంచి గుడ్లు తెప్పిస్తాను..." అని వెళ్లాడు వెయిటరు.

పొద్దుటినుంచీ హంపీలో తిరగడం వల్ల చెమటతో ఒళ్లంతా బంక మెత్తుకున్నట్లు చీకాకనిపిస్తున్నది. అమీరు స్నానాలగదికెళ్లి తృప్తిగా షవర్ కింద నిల్చొని స్నానం చేశాడు... సోపు రుద్దుకుని చెమట కంపుని పోగొట్టుకున్నాడు... చడ్డీ బనియన్ మార్చుకుని బయటికొచ్చాడు.

ఆమె కిటికీలోంచి బయటకు చూస్తూనే వుంది... అతని ఉతికి ఇస్త్రీ చేసిన పాంటు, శ్లాక్ వేసుకుని చెప్పులేసుకొని "నేనిక్కడే డామ్ మీద అరగంట తిరిగొస్తాను..." అని ఆమెకు చెప్పి బయటికొచ్చాడు...

ఆనకట్టపైన చల్లని గాలి... తతిమ్మా చోటంతా వేడి... హంపీ నరకం, జహన్నుమ్. 'అన్ని ప్రాంతాలు వదిలేసి ఇక్కడెందుకు రాజధాని కట్టారు...? భద్రత కోసమా? హక్క బుక్క వంటి మేకలను కాచేవారు వున్న జాగా! అందుకే దీన్ని రాజధానిగా కట్టుకునుండవచ్చు' అన్న ఊహ వచ్చింది. వీటన్నింటి వెనకనున్న వివరాలన్నీ రజియా ఇస్తుంది. అది ఆమె బాధ్యత అనుకున్నాడు... ఇంత ముభావంగా వున్నదెందుకనో సాయంత్రం నుంచీ..? కాదు కాదు మధ్యాహ్నం నుంచే అనే గుర్తుకొచ్చింది.

కళాకారులంటే ముభావులా? నేనూ కళాకారుడనే! మూడ్‌కే ఎక్కువ కాలం వెచ్చించి కాలం వెళ్లబుచ్చితే ఎలా? పని అయేదెలా? నేను, ఈమె ఈ కారణంగానే ఎన్నోసార్లు దెబ్బలాడుకున్నాము.

సినిమా తియ్యడానికని వచ్చి సీనులో మూడు రాలేదని ఒకరు మూడీగా, కూర్చుంటే తతిమ్మావారు చప్పట్లు కొట్టుకుంటూ కూర్చోవాలా? డబ్బును నీళ్లలా ఖర్చు చేసిన నిర్మాతలు ఉరేసుకోవాలి... అదృష్టం ఏమిటంటే ఈమె స్టోరీ, స్క్రిప్ట్, స్క్రీన్‌ప్లే రైటింగ్ షూటింగ్ సమయంలో తక్కువ. అలాగే ఆమె పాత్ర షూటింగప్పుడు తక్కువే... అయినా ఒప్పుకున్న ఏ స్క్రిప్టూ సమయానికి సరిగా ఇవ్వదు అని గుర్తుకొచ్చి, అమీరుకు కోపం వచ్చింది. ఇప్పుడూ అలాగే చేస్తుందా...? సెంట్రల్ గవర్నమెంట్ హెరిటేజ్ శాఖవారు, దేశంలోని అన్ని హెరిటేజ్ స్థలాలనూ చలనచిత్రాలుగా తీసి ప్రచారం చెయ్యాలన్న ఆలోచనలతో హంపీని తీసే బాధ్యత నాకిచ్చారు... అసలు విషయం ఏమిటంటే చూసే వారి మనసులలో పుట్టే ముస్లిం వ్యతిరేకభావాలు తుడిచిపెట్టుకుపోయేట్లుండాలి. శిథిలావశేషాలు సాక్షి చిత్రంగా తీయకూడదు అని ప్రభుత్వం అలిఖిత ఉద్దేశ తీర్మానం. దీని నేపథ్యం గుర్తుకొచ్చింది... ఈ మధ్య దేశంలో హిందూమూలాలను వెతుకుతున్నారు... ఎక్కువమంది సనాతనవాదులైతే దేశ ఐక్యత ఏమవుతుంది?

ఈ సనాతనమనోభావాలు మొదలై నెల అయిందా? నెలపైన ఎనిమిది రోజులనుంచీ, రాష్ట్రం మనసంతా ఝుమ్ అంటోంది. తత్తరపడుతున్నది. అల్పసంఖ్యాకుల భద్రతాభావాలు అడుక్కి దిగిపోయిన ఘటన, అల్పసంఖ్యాకుల పవిత్ర ప్రార్థనాస్థలం బాబ్రీ మసీదుని పడగొట్టారు. నేను అయోధ్యకెళ్లి చూడలేదు. అక్కడికి అందరికీ ప్రవేశాన్ని నిషేధించారు. వేలమంది పోలీసులు కాపలా! పడగొట్టి నెలమీద వారం అయింది... పోలీసు కాపలా మాత్రమే చాలదనీ, దేశంలోని ప్రతి ఒక్కరి మనసులోనూ సహిష్ణుతను పెంచే భావాలను నాటాలి. అందుకు కార్యక్రమాలను రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. అధికారపక్షం, లౌకికవాదులు, వామపక్షం వారు, విద్య ద్వారా, ప్రసారమాధ్యమం ద్వారా అల్పసంఖ్యాకులను గొప్పగా చూపించేందుకు ఎక్కువ అవకాశం ఇచ్చి, అల్పసంఖ్యాకులకు వ్యతిరేకంగా మినహాయింపుగా లేకుండా వారికి తలవంచే విధంగా ఈ సాక్షి చిత్రం నిర్మాణదర్శకత్వాలను నాకివ్వడం నేను అల్పసంఖ్యాకుడననేనా? ప్రతిభాశాలిననా...?

అన్న ప్రశ్న పుట్టింది... వారి అభిప్రాయం ఏదైనా అవనీ, నేనొక ప్రతిభాశాలి డైరక్టరునే కాకపోతే ఇయ్యరు. నేను ఒప్పుకోకపోదును. దీన్ని సరిగ్గా సకాలంలో పూర్తిచేసి ఇస్తే ఇంకా కొన్ని చిత్రాలను తీసే బాధ్యతను ఇస్తామన్నారు. ప్రతీ దాంట్లోను పది పదిహేను లక్షలు లాభం వచ్చే పథకాలు. హంపీ మేము ఇదివరకు చూసిన ప్రదేశమే! ఇప్పుడు మళ్లీ చూశాక ఆమె రెండు మూడు గ్రంథాలు చదివి రాయాలి. దర్శకుడనైన నేను కెమేరామేన్ చేత తీయించి జోడించిన చిత్రాలకు వివరాలను సిద్ధం చెయ్యాలి... షూటింగు సమయంలో ఆమె వుండాలి. ఉంటే బాగుంటుంది... కేవలం మూడ్ లేకపోవడమే కాదు... మంకు మూసుకున్నట్లుగా కనపడుతున్నది... కొత్తగాను కనపడుతున్నది.. మాంద్యం కాదు, బడలిక. ఆ ఎండ, వేడి బండలు... కారున్నా ఒక్కోచోట నడవాల్సి రావడం అగ్ని పరీక్షగా పరిశీలించడం... ఇవన్నీ సామాన్యవిషయాలా...? మూడురోజుల నుంచీ ఇదే పని... ఏభై నాలుగేళ్లు వచ్చినయ్యి. ఓపికేం వుంటుంది? ...నాకూ అంతే వయసైంది. మరి నేనెందుకంత అలసిపోలేదు? స్నానం చేసి హాయిగా వాకింగ్ చేస్తున్నాను... ఈ వ్యత్యాసం అనిపించగానే ఎవరు ఏమన్నా ఆడది అంటే అబల అన్న మాటను కాదనలేము. దైహికంగాను అంతే బుద్ధిలోనూ అంతే, దైవసృష్టి అబద్ధం కాదనుకున్నాడు అమీరు.

రాత్రి భోజనం చేస్తున్నప్పుడు ఆమె అన్యమనస్కురాలుగానే వున్నది.

పడుకున్నప్పుడు అతనడిగాడు. "చూడవలసినవన్నీ చూశాము... చూడడం పూర్తి అయిందనుకుంటే ఈ రాత్రి రైలుకే బెంగళూరు వెళ్లి పోయుండచ్చు. రేపు పగలంతా ఈ విశ్రాంతిగృహంలో విశ్రాంతి తీసుకుని రాత్రి రైలుకు వెళదాము. నీకు చదవాల్సింది ఇంకా ఏమైనా వుందా? ఇంతవరకూ చదివింది గుర్తుంచుకున్న దానితో వివరణ రాయగలవా? ప్రతీ అయిటమ్ చూపిస్తున్నప్పుడు వివరించడానికి చాలా చదవాలి. సరైన గైడ్లను పట్టుకుంటే కొంత సమాచారం దొరకవచ్చును...!"

ఆమె ఇప్పుడూ మాట్లాడలేదు... పూర్తిగా వేరే ఆలోచనలా? లేక తన మీద కోపగించుకుందా? అన్న సందేహం వచ్చిందతనికి... కోపం కాదు. అయినా తాను చేసిన తప్పు మాత్రం ఏముంది? అని పొద్దుటి నుంచీ సాయంత్రం వరకు జరిగినదంతా గుర్తు చేసుకున్నాడు... ఏమీ గోచరించలేదు. ఆడవారి కోపాలకు ప్రత్యేకమైన కారణాలేవీ వుండవనుకున్నాడు. తనకు మాట్లాడడానికి ఏమీ తోచలేదు. మళ్లీ మళ్లీ మాట్లాడ్డం తన ఆత్మగౌరవానికే భంగం అని అనుకున్నాడు. ఆత్మగౌరవాన్ని భంగపరిచే

ఇలాంటి సన్నివేశాలు ఎన్నో వచ్చినయ్యి, వెళ్లినయ్యి... అదీ దాంపత్యజీవితంలోని ఓ భాగం అనుకున్నాడు. సమాధానపడి దాటానని గుర్తు చేసుకున్నాడు.

కిటికీలోంచి చల్లటి గాలి వీస్తోంది. అలలుగా నదిలోంచి లేచిన నీళ్లు ఆనకట్టను తాకి వెనక్కి తిరుగుతున్న చప్పుడు వినపడుతున్నది. కిటికీ సమీపానికెళ్లి నిలబడి చూసినా చీకటిలో ఏమీ కనపడదని పడుకుండిపోయాడు. కాసేపటికి ఆమే మాట్లాడింది...

"ప్రతిదానికి సరైన వివరణ చెప్పడం అంత సులభం కాదు... కెమెరాలో వాస్తవవిషయాలను చూపిస్తున్నప్పుడు వాటి నిజమైన కారణాలను వ్యాఖ్యానంలో చెప్పాలి. లేకపోతే వీరిది అబద్ధపు వ్యాఖ్యానం అని ప్రేక్షకులు నిర్ధారిస్తారు. మనుష్యుని కళ్ల కంటే కెమెరా కన్ను వేల రెట్లు శక్తిశాలి... ఈ తెలివితక్కువతనం వద్దనుకుంటే అలాంటి వాస్తవవిషయాల జోలికే వెళ్లొద్దు... వాటన్నింటిని వదిలేసి హంపీ మీద సాక్షిచిత్రం తయారుచెయ్యడం సాధ్యమా?"

ఆమె అలా మాట్లాడ్డం అతనికి నిరాశనిపించింది. "ఉదాహరణతో డైరెక్టుగా చెప్పు. సిగ్గుచేటు, నిజాలు అబద్ధాలు అన్నవేవి? అన్ని ప్రశ్నలకూ సమాధానాలు కనుక్కునే శక్తి, కళాకారులకున్నట్లు మరెవరికీ వుండదన్నది నీకు తెలుసు."

"ఉగ్రనరసింహ విగ్రహాన్ని చూశావుగా? ఉగ్రనరసింహమో, లక్ష్మీనరసింహమో ఈ భగ్నస్థితిలో సరిగా తెలియడం లేదు... ఎంత సుందరమైన శిల్పం...! ఆ చెక్కిన తీరులు ఎదురుగా నిల్చుని చూస్తూంటే కలిగే అలౌకికభావం...! దీని కాళ్లు, చేతులు ఎవరు పగలగొట్టి నాశనం చేశారో...? విజయ విఠల దేవాలయాన్ని ఎవరు ధ్వంసం చేశారో? నరసింహునికి ఆ పైన ఓ గుడివుంది. దాన్ని చెక్కముక్కలను నింపి నిప్పు పెట్టిన వేడికి గుడి విగ్రహాలు కరిగాయి. విగ్రహాల కాళ్లు, చేతులు పగలగొట్టారు. విజయ విఠలాలయాన్ని కూడా అలాగే కట్టె పుల్లలను నింపి నిప్పు పెట్టాక రెండోసారి నాశనం చేశారు అన్నది ఎవరికైనా స్పష్టంగా తెలుస్తుంది. ఎందుకంటే రాళ్లపైన కాలిన గుర్తులింకా వున్నాయి. అలాగే ఇతర దేవాలయాలు, విగ్రహాలు వీటన్నింటినీ ఎవరు ఎందుకిలా ధ్వంసం చేశారన్నది చెప్పకపోతే వివరాలు అసంపూర్ణమవుతాయి.

"తప్పకుండా చెప్పాలి. మధ్యకాలంలోని పాళెయగార్ల శక్తియుక్తులు నాశనమయినయ్యి అని మనసుకు హత్తుకునేట్లు చెప్పాలి. నాదే ఓ సొంత ఆలోచన ఒకటుంది. సమస్త బుద్ధిజీవులూ ఒప్పుకునేది... విజయనగరం ఆ కాలంలో సరిసాటి